సాక్షి కామారెడ్డి

మంగళవారం । 28 । మార్చి । 2023



మహోన్నతుడు బసవేశ్వరుడు

మనుషులంతా ఒక్కటేనని చాటిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడు అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



ప్రజావాణిలో 56 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 56 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ జితేష్ వి పాటిల్ వినతులు స్వీకరించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.6 /18.5

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఆయుష్మాన్ భారత్ కోసం వివరాల నమోదు



కామారెడ్డి టౌన్: పట్టణంలోని 34వ వార్డులో సోమవారం బీజేపీ వార్డు కౌన్సిలర్ ఆకుల సుజిత ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్డు కోసం ఉచితంగా వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఆయుష్మాన్ భారత్ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా ఏటా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ పథకం అమలు అవుతుందన్నారు. కేంద్రానికి మంచి పేరు వస్తుందన్న కారణంతో ఇన్నాళ్లు సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల భరత్, తేలు శ్రీనివాస్, నరేష్‌రెడ్డి తదితరులున్నారు.

‘పోటీ పరీక్షలకు సిద్ధంకండి’



కామారెడ్డి అర్బన్: అభ్యర్థులు బాగా చదవి పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. కామారెడ్డిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అభ్యర్థులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, కార్యదర్శి బుగ్గారెడ్డి, తహసీల్దార్ వెంకటరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నర్సింహం తదితరులు పాల్గొన్నారు.

‘దేశ రక్షణ కోసం ముందుకురావాలి’



తాడ్వాయి: దేశ రక్షణ కోసం యువత ముందుకు రావాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. చిట్యాల గ్రామంలో సోమవారం దివంగత ఆర్మీ జవాన్ కంది సిద్ధిరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిద్ధిరాములు దేశ రక్షణలో వీరమరణం పొందారన్నారు. ఆయన స్ఫూర్తితో యువత సైన్యంలో చేరాలని, ఇంటికో సైనికుడు తయారు కావాలని సూచించారు. సిద్ధిరాములు తల్లి తన పింఛన్ డబ్బుల కొడుకు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. సిద్ధిరాములు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ అన్యోన్య, సీఐ శ్రీనివాస్, ఎస్సై ఆంజనేయులు, భువనేశ్వర్, ఎంపీటీసీ రాజమణి, సిద్ధిరాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

31 నుంచి బోదకాలు వ్యాధిపై పరీక్షలు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోదకాలు వ్యాధి నిర్మూలనకు ఈనెలాఖరునుంచి ఏప్రిల్ 6 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు మలేరియా అధికారి తుకారాం తెలిపారు. సోమవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త బోదకాలు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతుల పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎంపిక చేసిన పాఠశాలకు డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్లు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

కొలిచేవారేరి..?

- వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- 22 మండలాలకు ఉన్నది ఆరుగురే..
- అందులో ఇద్దరు సెలవులో..
- పెండింగ్‌లో 2 వేలకుపైగా దరఖాస్తులు
- పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతన్నలు



దోమకొండలో భూమి సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)



రైతుల మధ్య భూ తగాదాలు తలెత్తినప్పుడు.. ఆ భూమిని కొలిచి సమస్యను పరిష్కరిస్తారు. అయితే జిల్లాలో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉండడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు.

దోమకొండ: భూముల హద్దులు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు తేల్చడానికి భూములను సర్వే చేస్తారు. అయితే జిల్లాలో సర్వేయర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రైతులకు సకాలంలో సేవలు అందడం లేదు. జిల్లాలో 22 మండలాలు ఉండగా.. ఆరుగురు సర్వేయర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఇందులో ఇద్దరు కొంతకాలంగా సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ధరణి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భూ వివాదాలు పెరిగిపోయాయి. సర్వే చేసి భూ సమస్యలను పరిష్కరించాలంటూ రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్వేయర్ల కొరతతో అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 2 వేల పైచిలుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

గడువు నిబంధన గాలికి..

భూ సర్వే కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న మూడు నెలలలోగా సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. సర్వేయర్లు రికార్డుల ఆధారంగా సర్వే చేసి హద్దులు, విస్తీర్ణం తేల్చాలి. కానీ జిల్లాలో సర్వేయర్లు లేకపోవడంతో నెలలు గడుస్తున్నా.. దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. సమస్య పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్లతో పనులు చేయించుకోవాలని సూచిస్తున్నారని, దీంతో ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించుకుంటున్నామని పలువురు రైతులు తెలిపారు.

పరికరాలు లేక..

గతంలో గొలుసు పద్ధతిలో భూములను కొలిచేవారు. ప్రస్తుతం జీపీఎస్ పరికరంతో కొలతలు వేస్తున్నారు. ఈ పరికరానికి రూ.15 నుంచి రూ. 20 వేల వరకు ఖర్చవుతుంది. ప్రభుత్వం పరికరాలను సమకూర్చకపోవడంతో సర్వేయర్లే సొంతంగా కొనుగోలు చేసుకుంటున్నారు.

అడిగినంత ఇస్తేనే..

ధరణి పోర్టల్‌లో చిన్నపాటి సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్‌లో భూములు కనిపించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా సర్వేయర్లు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నెలల తరబడి తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు విసిగిపోయి సర్వేయర్లు అడిగినంత ఇచ్చి సర్వే చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

సర్వే కోసం తిప్పుతున్నరు



మాకు దోమకొండ మండలం అంచనూరు శివారులో వ్యవసాయ భూమి ఉంది. దానిని కొలవాలంటూ తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. మీసేవతో పాటు బ్యాంకులో కూడా సర్వే కోసం డబ్బులు కట్టాం. కామారెడ్డిలో సర్వేయర్ కార్యాలయానికి వందల సార్లు తిరిగాం. చాలా రోజులనుంచి రేపు మాపు అంటూ తిప్పుతున్నారు కానీ ఇంతవరకు సర్వే చేయలేదు. – శ్రీహరి, దోమకొండ

సర్వేయర్‌లు లేక ఇబ్బందులు



ప్రతిరోజు సర్వే కోసం రైతులు, కులసంఘాల వారు వస్తున్నారు. రైతులు, వివిధ వర్గాల వారు సర్వే కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. మండలంలో కొన్ని నెలలుగా సర్వేయర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – కౌశిక్‌రెడ్డి, తహసీల్దార్, దోమకొండ

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కాయకల్ప బృంద సభ్యులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిని సోమవారం కాయకల్ప బృంద సభ్యులు సందర్శించారు. కాయకల్ప బృంద సభ్యులు వైద్యులు రఘు పూజారి, రహమాన్, స్టెల్లా, ప్రశాంత్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలోని అన్ని విభాగాలలో కలియ తిరిగారు. రికార్డులతోపాటు ఐపీ, ఓపీ, ప్రసూతి, ఆపరేషన్ థియేటర్, జనరల్, పురుష, మహిళ, చిన్నపిల్లల వార్డులు, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ, స్కానింగ్ కేంద్రం, మెటర్నిటీ, ల్యాబ్, ఎమర్జెన్సీ, ఎస్ఎన్‌సీయూ, ఎక్స్‌రే తదితర విభాగాలను పరిశీలించారు. డీసీహెచ్ఎస్ విజయలక్ష్మితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్ఎంవో శ్రీనివాస్, వైద్యులు సుజాత, ప్రవీణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

4,829 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం కంటి వెలుగులో 4,829 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 480 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 2,48,541 మందికి కంటి పరీక్షలు చేసి, 39,171 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

301 మంది విద్యార్థుల గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 301 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 8,811 మందికిగాను 8,510 మంది విద్యార్థులే పరీక్ష రాశారు. పరీక్షలను ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

‘సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె’



కామారెడ్డిలో సమావేశమైన ఐకేపీ వీవోఏలు

కామారెడ్డి రూరల్: సమస్యలను పరిష్కరించకపోతే వచ్చేనెల 2వ తేదీనుంచి సమ్మెకు దిగాలని ఐకేపీ వీవోఏల జిల్లా కమిటీ నిర్ణయించింది. సోమవారం కామారెడ్డిలోని ఇందిరా గాంధీ స్టేడియంలో ఐకేపీ వీవోఏల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివరాం నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ గౌస్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం తమకు రూ. 16 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గంగా విక్రమ్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి తేలు బాలరాజు, జిల్లా కార్యదర్శి సరితరెడ్డి, సభ్యులు మంత్రి అనసూయ, శివకుమార్, గోపాలరావు, సర్వయ్య, గిద్ద శ్రీకాంత్, కిషోర్ కుమార్, యాదగిరి, స్వప్న, మాధవి, కొరాపోలు పోశెట్టి, సందీప్, పోషయ్య, లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ గడ్డ.. పోచారం అడ్డా

- స్పీకర్ మచ్చలేని నాయకుడు
- డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బాన్సువాడ గడ్డ పోచారం అడ్డా అని డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. భూకబ్జాలు చేసిన వ్యక్తి స్పీకర్ గురించి మాట్లాడడాన్ని తప్పుపట్టారు. ఇటీవల హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. ఆ రోజు తాము ఒక్క సైగ చేస్తే కాంగ్రెస్ నాయకులు బాన్సువాడ నుంచి వెళ్లేవారు కాదన్నారు. బీజేపీ నేత మల్యాద్రిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. సొంత బావను చంపిన వ్యక్తి మల్యాద్రిరెడ్డి అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అబద్ధాలు ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని ఎమ్మెల్సీ విఠల్ విమర్శించారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. వచ్చేనెల 15లోపు అన్నిచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేయాలన్నారు. 14వ తేదీనుంచి అబేడ్కర్ జయంతి నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కాంగ్రెస్, బీజేపీల నుంచి సుమారు 400 మంది బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మీరా నసీముద్దీన్, ఖమ్ము, నర్సన్న చారి, హజార శంకర్, వనం గంగాధర్, అవుటి సాయిలు, గుడుగుట్ల అనిల్ తదితరులు ఉన్నారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు

- రాహుల్ అంటే మోదీకి భయం
- సత్యాగ్రహ దీక్షలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు నిర్ణయం భావ ప్రకటన స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు వంటిదని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టడం, అదానీ మోదీల చీకటి స్నేహంపై నిలదీయడంతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు. రాహుల్ అంటే మోదీ భయపడుతున్నారన్నారు. అందుకే కుట్ర చేసి ఆయనపై అనర్హత వేటు వేశారన్నారు. ప్రజల గొంతును అణచివేయలేరని, ప్రజలే మోదీ, బీజేపీకి తగిన బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. ఈ కుట్రను న్యాయపోరాటం ద్వారా ఛేదిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, పాక జ్ఞానేశ్వరి, అమ్ముల ముకుందం, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, ఐరేని సందీప్, గూడెం శ్రీనివాస్, గణేష్ నాయక్, అనంతరెడ్డి, సుతారి రమేష్, భీంరెడ్డి, ధాత్రిక సత్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను ప్రశ్నించారు. సోమవారం సత్యాగ్రహ దీక్ష ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో 132 కేవీ సబ్ స్టేషన్లు ఆరు మంజూరు చేశానన్నారు. నియోజకవర్గంలో 20 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని, అందులో 5 వేల ఇళ్లు కామారెడ్డి పట్టణంలోనే ఇచ్చామని పేర్కొన్నారు. కామారెడ్డిలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయించానన్నారు. దోమకొండకు తాను జూనియర్ కళాశాల తీసుకు వచ్చానని, దానిని గంప గోవర్ధన్ డిగ్రీ కళాశాలగా చేయించలేకపోయారని విమర్శించారు. డ్రెయినేజీలు, లైట్లు, సిమెంట్ రోడ్లు వేస్తే అభివృద్ధి అంటారా అని ప్రశ్నించారు. తాను అధికారంలో ఉండి ఉంటే కామారెడ్డి స్టేడియాన్ని అండర్ 19 క్రికెట్ ఆడేలా తీర్చిదిద్దేవాడినన్నారు. కామారెడ్డి అభివృద్ధిపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమేనన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘సర్కారు కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి’

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులు, సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన కొనసాగుతోందన్నారు. మొక్కల పెంపకం కోసం నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తేనెటీగల పెంపకం చేపట్టాలన్నారు. ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బిచ్కుంద, బాన్సువాడ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ కిష్టయ్య, ప్రవీణ్ కుమార్, గంగాధర్, శ్రీనివాస్, అధ్యాపకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన..

కామారెడ్డి అర్బన్: ఇస్రో జాతీయ పురస్కారం పొందిన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వి.రామకృష్ణను కలెక్టర్ అభినందించారు. రామకృష్ణ విద్యార్థులకు సులభమైన పద్ధతితో గణితం బోధిస్తున్నారు. జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వీరు ప్రదర్శించిన ‘త్రికోణమితీయ భావనలు, నిజ జీవిత సమస్యలకు అన్వయించి నిరూపించే ప్రదర్శన’ ప్రశంసలు అందుకుంది. దీనికి ఇస్రో పురస్కారం లభించింది. సోమవారం ఆయన కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించారు.



టీచర్ రామకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్లుప్తంగా

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్ పరీక్షల్లో 1585 మంది విద్యార్థులకు 1473 మంది హాజరు కాగా 112 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పీజీ 1వ, 5వ, 7వ సెమిస్టర్ పరీక్షలలో 1768 మందికి 1622 మంది పరీక్ష రాశారు. ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 30 మందికి గానూ 26 మంది, ఎల్‌ఎల్‌ఎం మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 10 మంది విద్యార్థులకు 9 మంది హాజరైనట్లు ఆమె వివరించారు.

నేటి నుంచి తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోని లా కాలేజీలో మంగళ, బుధవారం (ఈ నెల 28, 29న) తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 65వ సమావేశాలు నిర్వహించనున్నట్లు వీసీ రవీందర్ తెలిపారు. సమావేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధినితో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశాలకు తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చరిత్ర ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరవుతారని హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం వీరేందర్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ పరీక్షల్లో సోమవారం జిల్లావ్యాప్తంగా 670 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు భౌతిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,543 మంది విద్యార్థులకు 15,873 మంది పరీక్ష రాశారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 110 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్ ప్రజలను ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ప్రజావాణి కార్యక్రమానికి విధిగా జిల్లా అధికారులే హాజరుకావాలని, క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాల్సిన సందర్భంలో శాఖాపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగిన తన కిందిస్థాయి అధికారిని ప్రజావాణికి హాజరయ్యేలా చూడాలన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

కామారెడ్డి ప్రజావాణికి 56 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్, అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మొత్తం 56 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఆర్‌డీవో సాయన్న, అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ..

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం



అక్బర్‌నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో సోమవారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.50లక్షలతో చేపట్టిన నక్కల వాగు బ్రిడ్జి, సీసీ రోడ్లు, పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. రూ.75లక్షలతో చేపట్టనున్న అభయాంజనేయ స్వామి ఆలయ పనులు, సీసీ రోడ్డు, మజీద్ ప్రహరీ, దర్గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక అక్బర్‌నగర్‌కు రూ.మూడు కోట్లు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దేవాలయాలు, పార్థన మందిరాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. విఠలేశ్వర ఆలయానికి రూ.10లక్షలు, అభయాంజనేయ స్వామి ఆలయానికి అదనంగా రూ.10లక్షలు, దుర్గామాత గుడికి ఎండోమెంట్ ద్వారా రూ.25లక్షలు మంజూరైనట్లు చెప్పారు.

ప్రకృతి ఆశ్రమం అభివృద్ధికి రూ.75లక్షలు

అక్బర్‌నగర్‌లోని ప్రకృతి ఆశ్రమంలో తక్కువ ఖర్చుతో మంచి చికిత్స లభిస్తుందని స్పీకర్ పోచారం అన్నారు. ఆశ్రమంలో స్థానికులు వంద మంది ఉపాధి పొందుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆశ్రమ అభివృద్ధి పనులకు రూ.75లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగమణిప్రసాద్, ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, ఉప సర్పంచ్ రంజిత్, వైస్ ఎంపీపీ సాయిలు, తోట సగయ్య, పత్తి లక్ష్మణ్, సంజీవ్ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడు

బాన్సువాడ: సమాజంలో కులమత భేదాలు లేకుండా మనుషులందరు ఒకటేనని 1200 ఏళ్ల క్రితమే చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి బసవేశ్వరుడని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని ఒకటో వార్డులో వీరశైవలింగాయత్ కమ్యూనిటి భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడా రు. భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజురు చేశానని, మరో రూ.25 లక్షలు మంజురు చేస్తానన్నారు. బసవేశ్వర జయంతి అధికారికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సుముచిత న్యాయం చేస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో 200 ఎకరాల్లో అన్ని కులాలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో బసవేశ్వర భవనం కోసం రూ.కోటి నిధులు కూడా మంజూరు చేసిందని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రిడేషన్‌లో బాన్సువాడ మాత శిశు ఆస్పత్రికి దేశంలోనే అవార్డు రావడంతో హర్షనీయమన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, వీరశైవలింగాయత్ సంఘం జిల్లా అధ్యక్షుడు దిగంబర్, శంకర్‌పటేల్, విజయ్‌పటేల్, మారుతి పటేల్, మహాదేవి, శ్రీలత, గంట చంద్రశేఖర్, మల్లికార్జున్, వీరప్ప, రమేష్, సుభాష్, ఆంజనేయులు, అశోక్‌పటేల్, నాయకులు అంజిరెడ్డి ఉన్నారు.



కంప్యూటర్ కోర్సులకు డిమాండ్

తెయూ(డిచ్‌పల్లి): కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసి మంచి నైపుణ్యాలు పెంపొందించుకున్న విద్యార్థులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని రిసోర్స్ పర్సన్స్ మానస, నిత్యలక్ష్మీ పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, హైదరాబాద్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో సోమవారం కాలేజీ సెమినార్ హాల్‌లో 'బిల్డింగ్ మెషీన్ లెర్నింగ్ వెబ్ అప్లికేషన్స్ త్రూ ఓపెన్ సోర్స్ కోడ్ ఫ్లాట్‌ఫామ్' అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా.. మెషీన్ లెర్నింగ్, ఉపయోగాలు, కంప్యూటర్ అప్లికేషన్స్, డాటా అక్విజిషన్, ప్రీ ప్రాసెసింగ్ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ మానస అవగాహన కల్పించారు. పైథాన్ లాంగ్వేజ్, మెషీన్ లెర్నింగ్‌లో ప్యాకేజెస్ ను ఎలా వాడాలనే అంశాలపై నిత్యలక్ష్మీ వివరించారు. వర్క్‌షాప్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, కన్వీనర్ నందిని, అధ్యాపకులు భ్రమరాంభిక, అతిఖ్, నీలిమ, ఆనంద్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్ మానస

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 29న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పీవీఆర్ వేణుమాల్ ప్రైవేట్ లిమిటెడ్, జీవన్‌రెడ్డి మాల్ ప్రైవేట్ లిమిటెడ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్స్, టీమ్ లీడర్లు నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతంలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, ఎలక్ట్రికల్, హోటల్ మేనేజ్‌మెంట్ ఆపైన చదివిన అభ్యర్థులు అర్హులని, 28 ఏళ్ల లోపు ఉన్నవారు హాజరు కావాలని సూచించారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతి, యువకులు బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్ పోర్టుసైజు ఫొటోలు తీసుకొని నగరంలోని శివాజీనగర్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హజరుకావాలన్నారు. వివరాలకు 6305743423, 9581768413, 9959456793 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నిఖత్ జరీన్‌కు బాజిరెడ్డి అభినందనలు



మోపాల్: ప్రపంచ మహిళల బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి సత్తా చాటిన నిఖత్ జరీన్‌కు టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. నిజామాబాద్ బిడ్డ నిఖత్ సాధిస్తున్న వరుస విజయాలు యావత్ దేశానికి గర్వ కారణమని హర్షం వ్యక్తం చేశారు. నిజామాబాద్ కీర్తి ప్రతిష్టలు, రాష్ట్ర గౌరవాన్ని చిరస్థాయిలో నిలిచిపోయేలా తన ప్రతిభను కనబరుస్తున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. నిఖత్ జరీన్‌కు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరింపజేయాలని ఆకాంక్షించారు.

విద్యార్థి ఉన్నత ఆశయాలను సాధించాలి



నిజామాబాద్ సిటీ: విద్యార్థులు చిన్నా నాటి నుంచి ఉన్నతమైన ఆశయాన్ని సాధించాలన్న లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ నిర్వహిస్తున్న రోటరీ రైలా కార్యక్రమం అద్భుతమని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. సోమవారం నగర శివారులోని దాస్‌నగర్ నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం రైలా – 2023 (రోటరీ యూత్ లీడర్ షిప్ అవార్డ్స్ ప్రోగ్రాం) కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి జీవితంపై ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు ప్రయాణించడం ఒక ఉన్నతమైన ఆలోచన అన్నారు. కార్యక్రమంలో నవ్యభారతి, హోవార్డ్, బ్లూమింగ్ బర్డ్స్, మాణిక్‌భవన్, అక్షరధామ్, నిర్మలా హృదయ కాన్వెంట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకియాట్రిస్ట్, సినీ కళాకారుడు డాక్టర్ శ్రీధర్, రోటరీ జిల్లా 3150 గవర్నర్ శరత్ చౌదరి, కార్యక్రమ చైర్మన్ జగదీశ్వర్ రావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సతీష్ షాహ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్, సంతోష్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 29న వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ నగర సీఐ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు పాటలో పాల్గొని వాహనాలను దక్కించుకోవాలన్నారు.

కిక్ బాక్సర్‌కు సన్మానం



నిజామాబాద్‌నాగారం: ఆల్ ఇండియా యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో గిరిరాజ్ కాలేజీ బీఏ విద్యార్థి ఉమ రజతం పతకం సాధించింది. పతకం సాధించడంపై ఆమెను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, పీడీ బాలమణి సన్మానించారు.

నియామకం

కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ కామారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శిగా వి భాస్కర్‌ను నియమిస్తు రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీం నియామక పత్రం అందజేశారు. సమాచార హక్కు చట్టం అమలు కోసం జిల్లా అంతటా పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సలీం కోరారు. ఈ కార్యక్రమంలో స.హ చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, ఎస్.లింబయ్య, షబనా, చారి తదితరులు పాల్గొన్నారు.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని గాంధీనగర్‌లో మంగళవారం జరగనున్న బాల్య వివాహాన్ని అధికారులు సోమవారం అడ్డుకున్నారు. మంగళవారం వివాహం ఉండగా సమాచారం అందుకున్న ఐసీపీఎస్ అధికారి జామురు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరీ, సూపర్‌వైజర్ సరస్వతి, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులతో సోమవారం గాంధీనగర్‌కు చేరుకున్నారు. బాల్య వివాహ కార్యక్రమాలను అడ్డుకున్నారు. ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికను కేజీబీవీకి తరలించారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

హత్యాయత్నం కేసులో ఒకరికి నాలుగేళ్ల జైలు

ఖలీల్‌వాడి : బాలుడిపై హత్యాయత్నం చేసిన కుడుములు లడ్డు అలియాస్ సుంకరి రవికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎన్ శ్రీకాంత్ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పాలారం గ్రామానికి చెందిన శ్యామ్(13) తన చిన్నాన్న అయిన కుడుములు రాజు దగ్గరకు నందిపేట్ మండలం వన్నెల్(కె) గ్రామానికి వచ్చాడు. వారి బంధువైన కుడుములు లడ్డు అలియాస్ సుంకరి రవి మాక్లూర్ మండలం ధర్మోరాలో స్థిరపడ్డాడు. రవి వన్నెల్(కె) గ్రామానికి వచ్చి నిజామాబాద్‌లో సినిమా చూసివద్దామని చెప్పి 2016 జూన్ 2న శ్యామ్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. శ్యామ్ తండ్రి జీవరత్నంతో తనకు ఉన్న పాత కక్షను మనసులో పెట్టుకొని అతనిని చంపాలనుకున్నాడు. నందిపేట వైన్‌షాపులో కొనుగోలు చేసిన బీర్లు తాగి, బీరు సీసాను పగులగొట్టి శ్యామ్‌ను పొడిచి మృతి చెందాడాని భావించి వెళ్లిపోయాడు. గాయపడిన బాలుడిని చూసిన గ్రామస్తులు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ఆధారంగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన కోర్టు ముద్దాయిపై హత్యాయత్నం కేసు రుజువైనట్లు నిర్ధారిస్తూ నాలుగేళ్ల కఠిన జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య వాదనలు వినిపించారు.

బావపై బావమరిది దాడి

రామారెడ్డి: కుటుంబ కలహాల నేపథ్యంలో బావపై బావమరిది దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని రంగంపేట శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్సై రవీందర్‌రావు తెలిపిన వివరాలు.. కామారెడ్డి మండలం లింగాపూర్‌కు చెందిన మల్లుపేట సంగయ్యకు, ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన మానసతో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మానస తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో తన భార్యను కాపురానికి తీసుకెళ్లడానికి సంగయ్య తన పెద్దమ్మతో కలిసి ఉప్పల్‌వాయి వచ్చాడు. అక్కడ సంగయ్యకు అత్తమామలతో గొడవ జరిగింది. దీంతో వారి ఇద్దరిని సంగయ్య చితకబాదినట్లు గ్రామస్తులు తెలిపారు. దాడి అనంతరం సంగయ్య తన గ్రామానికి బయలు దేరగా రంగంపేట శివారు దగ్గర మానస సోదరుడు నరేష్ కట్టింగ్ ప్లేర్‌తో సంగయ్య తలపై దాడి చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని ఏఎస్సై తెలిపారు.



గాయపడిన సంగయ్య

ఇద్దరి బైండోవర్



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన ఆకాష్, బూర్గుల్ గ్రామానికి చెందిన రాజశేఖర్‌ను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై నాగగోని రాజు తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉండటంతో ఇక మీదట గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అల్లరు జరగకుండా ముందస్తుగా బైండోవర్ చేశామని ఎస్సై చెప్పారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో నిందితుడి రిమాండ్

ఎల్లారెడ్డి: సెల్ ఫోన్లను చోరీ చేసిన నిందితుడిని పట్టుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన పాత నేరస్తుడు గుజ్జరి నాగరాజు పట్టణంలోని సలీం రైస్‌మిల్‌లో హమాలీలకు చెందిన మూడు సెల్ ఫోన్లను దొంగిలించినట్లు ఆయన తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి రిమాండ్ చేశామన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి



ప్రవీణ్(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని బొల్లారం ఊరచెరువులో చేపలవేటకు వెళ్లిన ఓ జాలరి ప్రమాదవశాత్తు నీటమునిగి మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన బెస్త ప్రవీణ్(25) గ్రామశివారులోని చెరువులో ఆదివారం సాయంత్రం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల వేటకు వెళ్లిన ప్రవీణ్ తిరిగి ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చెరువులో గాలించారు. అయినా అతని ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బందితోపాటు నాగిరెడ్డిపేట పోలీసులు చెరువులో గాలించి ప్రవీణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రవీణ్ వల వేసేక్రమంలో ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి నీటిలో పడిపోవడంతోపాటు కాళ్లకు, వల చుట్టుకోవడంతో మృతిచెందినట్లుగా గుర్తించారు. మృతుడి తల్లి బెస్త దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..

మాచారెడ్డి: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని బండ రామేశ్వరపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనికేషి నర్సింలు(45) పొలం వద్ద విద్యుత్ మోటార్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



నర్సింలు(ఫైల్)

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య



రాజమణి (ఫైల్)

నవీపేట: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి రాజమణి(38) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి సోమవారం తెలిపారు. రాజమణికి మతిస్థిమితం లేకపోవడంతో భర్త విడాకులు ఇచ్చాడని పేర్కొన్నారు. తల్లిదండ్రుల దగ్గరే ఉంటున్న రాజమణి జీవితంపై విరక్తి చెంది సోమవారం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుంది. బాధితురాలిని 108లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపూర్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫయజుల్(20) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జ్ఞాన్‌సింగ్ సోమవారం తెలిపారు. ఫయజుల్ సారంగాపూర్‌లోని సోఫా తయారీ సెంటర్‌లో మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

పెద్దకొడప్‌గల్: మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. చిన్నదేవాడ నుంచి చిన్నకొడప్‌గల్‌కి ఆటోలో పలువురు శుభకార్యానికి వెళ్తుండగా మార్గమధ్యలోని ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అదే దారిలో వెళ్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కుమారుడు హరీశ్‌సింధే క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారికి అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మద్యం తాగి ఆటో నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

